జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 2 | డిసెంబర్ | 2025 ♦ పేజీలు : 4


## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన సాధారణ ఎన్నికల పరిశీలకుడు సర్వేశ్వర్ రెడ్డి



**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 1, ప్రజాజ్యోతి:** రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సాధారణ ఎన్నికల పరిశీలకులు గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ వి. సర్వేశ్వర్ రెడ్డి సోమవారం పాల్వంచ మండల పరిధిలోని జీపీ ఉల్వనూర్, జీపీ బంజరా, జీపీ సత్యనారాయణపురం ,జీపీ కోడిపుంజులవగు గ్రామపంచాయతీలను సందర్శించారు. ఈ సందర్భంగా నామినేషన్ స్వీకరణ కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లను ఆయన పరిశీలించి, నామినేషన్ ప్రక్రియ ఎలాంటి అంతరాయం లేకుండా పారదర్శకంగా, సజావుగా సాగేందుకు

మిగతా 2 లో...





# తెలంగాణలో తొలి భూవిజ్ఞాన శాస్త్ర విశ్వవిద్యాలయం నేడు ప్రజలకు అంకితం

- చారిత్రాత్మక ఘట్టానికి సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ
- ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలనలో రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 1, ప్రజాజ్యోతి:** డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ప్రారంభోత్సవ ఏర్పాట్లను రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రాంగణంలోని మౌలిక సదుపాయాలు, విభాగాల ఏర్పాట్లు, ఆతిథ్య సదుపాయాలు, భద్రత, సభాస్థలి ఏర్పాట్లు, రవాణా నిర్వహణ వంటి అంశాలను శాఖల అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ నేడు జరగనున్న ప్రారంభోత్సవం సందర్భంగా ఏ లోపం లేకుండా సమన్వయంతో పనిచేయాలని సంబంధిత విభాగాలకు ఆయన ప్రత్యేక సూచనలు జారీ చేశారు. దేశంలోనే తొలి పూర్తిస్థాయి భూవిజ్ఞాన శాస్త్ర విశ్వవిద్యాలయంగా అవతరించబోయే ఈ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ ప్రారంభోత్సవానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పర్యవేక్షణలో పూర్తయ్యాయని, నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ యూనివర్సిటీ అధికారికంగా ప్రజలకు అంకితం కానుంది అన్నారు, మౌలిక సదుపాయాలతో ప్రకాశవంతంగా తీర్చిదిద్దిన యూనివర్సిటీ ప్రాంగణం ప్రాంతీయ గౌరవాన్ని మరింత పెంచిందన్నారు, కొత్తగూడెం ప్రాంతం విస్తారంగా కలిగిన బొగ్గు గనులు

మిగతా 2 లో...

## నీటి సంపులో చిన్నారి మృతదేహం

- ఇంటి నుంచి ఆడుకోవడానికి వెళ్లిన చిన్నారి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన కుటుంబసభ్యులు



**ఇల్లందు, డిసెంబర్ 1, ప్రజాజ్యోతి:** మండలంలోని మామిడిగూడెం పంచాయతీ సుంకర గూడెంలో ఓ ఇంటి ఆవరణలోని నీటి సంపులో పడి చిన్నారి ప్రాన్సీ (4) మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సుంకర గూడెం గ్రామానికి చెందిన ప్రభాకర్, తేజ్యా దంపతుల చిన్న కుమార్తె ప్రాన్సీ ఆడుకోవడానికి వెళ్లి

మిగతా 2 లో...

## అభివృద్ధి, పర్యావరణం రెండూ చేతులు కలిపి ముందుకు సాగాలి

- నేడు ప్రపంచం మొత్తం పర్యావరణహితానికి పాటుపడుతుంది.
- మన దేశం ఆ దిశగా మరింత ముందుకు పోవాల్సిన అవసరం ఉంది
- పర్యావరణానికి జరిగిన నష్టం ప్రకృతి ప్రకోపంలో కనిపిస్తోంది
- అనేక పర్యావరణ చర్యలతో సింగరేణి ముందడుగు
- సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్




**కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 1 – ప్రజాజ్యోతి:** పర్యావరణం అభివృద్ధి రెండూ కలిసి నడిచినప్పుడే సుస్థిర కోల్ మైనింగ్, ప్రగతి సాధ్యమవుతాయని, అభివృద్ధి కోసం పర్యావరణాన్ని నిర్లక్ష్యం చేయడం ఇక కుదరదని కేంద్ర పర్యావరణ

మిగతా 2 లో...

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన సాధారణ ఎన్నికల పరిశీలకుడు సర్వేశ్వర్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి...)
అధికారులు అన్ని విధాలా చురుకుగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు సులభతరం కావడానికి హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేసి, అవసరమైన మార్గదర్శకాలు సమయానుకూలంగా అందించాలని, నామినేషన్ సమర్పణ సమయంలో అధికారులు , సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అదేవిధంగా ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు, చట్టవ్యవస్థకు భంగం కలిగే సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుని, ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో శాంతియుత, నియంత్రిత వాతావరణం నెలకొనేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ ఎంపీడీవో, ఏ టి డి ఓ మోహన్ దమ్మపేట, ఇతర విభాగాధికారులు పాల్గొన్నారు.

## నీటి సంపులో చిన్నారి మృతదేహం



(మొదటి పేజీ తరువాయి...)
ఎంతసేపటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఊరంతా గాలించారు. ఈలోపు గ్రామంలోని మరో ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపులో ఆ చిన్నారి మృతదేహం కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు ఇల్లందు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇల్లందు ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. చిన్నారి మృతిచెందిన సంపు ఉన్న ఇంటి గేటుకు తాళం వేసి ఉందని, నాలుగేళ్ల చిన్నారి ఆ గేటు ఎలా ఎక్కి అందులో పడుతుందని కుటుంబ సభ్యులు అంటున్నారు. ముఖ్యంగా చిన్నారి మృతి పై కుటుంబ సభ్యులు సేతం పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..

## బి ఆర్ఎస్ పార్టీకి రాజీనామా



**భద్రాచలం టౌన్, డిసెంబర్ 1(ప్రజాజ్యోతి):** ఉద్యమకారులు , తెరాస పార్టీ సీనియర్ నాయకులు, పార్టీని నమ్ముకుని ఎన్నో ఏళ్లు పార్టీ సేవ చేసిన .అంబటి కర్ర కృష్ణ, అతని కుమారుడు అంబటి కర్ర రవి వర్మ వ్యక్తిగత కారణాలతో బిఆర్ఎస్ పార్టీ క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా చేశారు. కృష్ణగతంలో రెండు పర్యాయాలు భద్రాచలం మార్కెట్ కమిటీ మెంబర్ గా కూడా పనిచేశారు. ఆయన రాజీనామా వెనుక కారణాలు ఏంటో తెలియాల్సి ఉంది.

## సింగరేణి నర్సింగ్ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

**కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 1 – ప్రజాజ్యోతి:** కొత్తగూడెం సింగరేణి ప్రధాన ఆసుపత్రి సోమవారం నాడు చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.కిరణ్ రాజకుమార్ ఆదేశాల మేరకు డిసెంబర్ 1 న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఎయిడ్స్ వ్యాది పై అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సంధర్భముగా హెల్త్ డాక్టర్ లలిత, పాతాలజిస్ట్ డాక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ... ప్రతీ సంవత్సరం డిసంబర్ 1 వ తారీఖున ప్రపంచ వ్యాప్తముగా ఎయిడ్స్ వ్యాధి కారక హెచ్ ఐ.వీ.కి వ్యతిరేకంగా పోరాడడం కోసం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం జరుపుకోవటం జరుగుతుంది అని, ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన పెంచడం ఈ ఎయిడ్స్ డే యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. అనంతరం ఎల్ఆర్ కళాశాల విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధి రావటానికి గల కారణాలు, లక్షణాలు, రక్త పరీక్ష, చికిత్స, నివారణా మార్గాల గురించి అవగాహన కల్పించడం జరిగింది.



# తెలంగాణలో తొలి భూవిజ్ఞాన శాస్త్ర విశ్వవిద్యాలయం నేడు ప్రజలకు అంకితం

(మొదటి పేజీ తరువాయి...)
ఖనిజ వనరులు, భూమి అంతర్గత నిర్మాణాలకు సంబంధించిన విశిష్టతల నేపథ్యంలో, గతంలో స్థాపించబడిన మైనింగ్ ఇంజినీరింగ్ కాలేజీని ఆధునిక భూవిజ్ఞాన శాస్త్ర విశ్వవిద్యాలయంగా మార్చడం రాష్ట్రప్రభుత్వ దూరదృష్టికి నిదర్శనం అని ఈ విద్యాసంస్థ ఏజెన్సీ ప్రాంతాల విద్యార్థులతో పాటు దేశమంతటా ఉన్న విద్యార్థులకు అత్యున్నత శాస్త్రీయ పరిశోధనా అవకాశాలను అందించనుందన్నారు, జియాలజీ, జియోఫిజిక్స్, జియోకెమిస్ట్రీ, ఎన్విరాన్మెంటల్ సైన్సెస్ వంటి కీలక విభాగాలతో కూడిన ప్రత్యేక కోర్సులు ఏర్పాటు చేయబడుతున్నాయ నీ వీటి ద్వారా ఖనిజ అన్వేషణ, భూకంప శాస్త్రం, హైడ్రోజియాలజీ, జలవనరుల నిర్వహణ, విపత్తు నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో విద్యార్థులు ప్రామాణిక జ్ఞానం, ఆధునిక పరిశోధనా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం లభించనుందన్నారు , కోల్ మైన్స్ కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్న కొత్తగూడెం ప్రాంత ప్రత్యేక అవసరాలను దృష్టిలో ఉంచుకుని, భూకంప విశ్లేషణ, వరదల అధ్యయనం, భూగర్భ జలాల పరిశోధన, ఖనిజ సంపద అన్వేషణకు శాస్త్రీయ వేదికగా ఈ విశ్వవిద్యాలయం నిలవనుందన్నారు, “భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భూవిజ్ఞాన శాస్త్ర విశ్వవిద్యాలయం స్థాపన తెలంగాణ విద్యా రంగంలో చారిత్రాత్మక ఘట్టం అని అన్నారు. ఈ ప్రాంత భౌగోళిక ప్రత్యేకతలు, ఖనిజ సంపద, పర్యావరణ వైవిధ్యం భూవిజ్ఞాన రంగానికి అమూల్యమైందన్నారు, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం భవిష్యత్ తరాలకు శాస్త్రీయ ప్రపంచంలో కొత్త అవకాశాలను సృష్టిస్తుంది అని తెలిపారు. భూగర్భ జలాలు, ఖనిజ సంపద నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, విపత్తు నిర్వహణ వంటి కీలక రంగాలకు నిపుణులను తీర్చిదిద్దడంలో ఈ వర్సిటీ కేంద్ర పాత్ర పోషిస్తుంది అని అన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ తెలంగాణ శాస్త్రీయ అభివృద్ధి ప్రయాణంలో కొత్త అధ్యాయాన్ని రాసే చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని మంత్రి తెలిపారు. నేడు జరిగే వర్సిటీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పరిశీలన లో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, పర్యావరణం రెండూ చేతులు కలిపి ముందుకు సాగాలి





(మొదటి పేజీ తరువాయి...)
అటవీ శాఖ ఎక్స్ పర్ట్ అప్రైజల్ కమిటీ ఛైర్మన్ ఇందర్ పాల్ సింగ్ మాథారు అన్నారు. హైదరాబాద్ లో సోమవారం సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన "కోల్ మైనింగ్, పర్యావరణ సుస్థిరత"అనే అంశంపై జరిగిన జాతీయస్థాయి వర్క్ షాప్ లో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నేడు ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నాయని ఈ విషయంలో మనం కొంత వెనుకబడి ఉన్నామన్నారు. మానవాళి పర్యావరణకు నష్టం కలిగిస్తున్న నేపథ్యంలో ప్రకృతి ప్రకోపిస్తోందని, అది వరదలు భూకంపాలు , ధ్రువ ప్రాంతంలో మంచు కరగడం, హిమాలయాలు కరిగిపోవడం వంటి చర్యలు మనకు కనిపిస్తోందన్నారు. కనుక పర్యావరణకు ఎక్కువ ప్రాధాన్యతని ఇస్తూ మైనింగ్ నిర్వహించటం ఎలా? అనే అంశం పైన ఈ వర్క్ షాప్ లో మేధావులు మంచి నిర్ణయాలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఎక్స్ పర్ట్ అప్రైజల్ కమిటీ మెంబర్ సెక్రటరీ సుందర్ రామనాథన్ మాట్లాడుతూ... పర్యావరణహితంగా కొంత మైనింగ్లో మార్పులు వచ్చినప్పటికీ ఇవి మరింతగా పెరగాలని సూచించారు. సింగరేణి సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ మాట్లాడుతూ...సింగరేణి సంస్థ మొదటి నుంచి కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ దిశా నిర్దేశంలో అన్ని రకాల చర్యలు తీసుకుంటూ మైనింగ్ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇవి కాక తాము పర్యావరణ హితంగా ఓవర్ బర్డెన్ నుండి ఇసుక తయారీ ప్లాంటను ఏర్పాటు చేశామని, వాతావరణ కాలుష్యం జరగకుండా మిస్ట్ స్ప్రేయింగ్, డ్రై ఫాగ్ డస్ట్ సప్రెషన్ పద్ధతులు అవలంబిస్తున్నామని వివరించారు. సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేశామని పంప్డ స్టోరేజీ ప్లాంట్లను, గ్రీన్ హైడ్రోజన్, జియోథర్మల్ ఎనర్జీ వంటి ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. థర్మల్ పవర్ ప్రాజెక్టులో వెలువడే ఫ్లూ గ్యాస్ నుండి కార్బ న్ డయాక్సైడ్ ను వేరుపరిచి మిథనాలును తయారు చేసే ప్లాంట్ ను ప్రయోగాత్మకంగా చేపట్టామని, ఇవి కాక భూగర్భ జలాల పెంపుదలకు నీటి బిందువు జలసింధువు అనే కార్యక్రమం ద్వారా 62 కొత్త చెరువుల నిర్మాణం చేపట్టామని, 45 చెరువుల్లో పూడిక తీశామని వివరించారు. పర్యావరణ, జీవావరణ సమతుల్యత దెబ్బ తినకుండా మైనింగ్ రంగంలో ముందుకు పోవడానికి సింగరేణి సంస్థ సదా సంసిద్ధంగా ఉంటుందని ఆయన తెలియజేశారు. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా పలు బొగ్గు కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు, పర్యావరణ శాస్త్రవేత్తలు లలిత్ కపూర్, డాక్టర్ ఉమేశ్ జగన్నాథరావు కహలేకర్, డాక్టర్ సంతోష్ కుమార్ హంపన్నవార్, ఎస్.చంద్రశేఖర్, కె.బి.బిశ్వాస్, ప్రొఫెసర్ శ్యామ్ శంకర్ సింగ్, డాక్టర్ వినోద్ అగర్వాల్, మహిపాల్ సింగ్, డాక్టర్ రాజేశ్ ప్రసాద్ రస్తోగి, తరుణ్ కత్తుల, ఎన్.జ్యోతి కుమార్, కె.లక్ష్మా పాల్గొన్నారు. ఈ వర్కుషాప్ ఉద్దేశాలను డైరెక్టర్ (పి అండ్ పి) కె.వెంకటేశ్వర్లు ముందుగా వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్వీ సూర్యనారాయణ, ఈడీ (కోల్ మూవ్మెంట్) బి.వెంకన్న, జీఎం (కో ఆర్డినేషన్) టి.శ్రీనివాస్, జీఎం(సీపీపీ) మనోహర్, జీఎం (ఎన్విరాన్మెంట్, ఫారెస్ట్రీ) సైదులు, కార్పొరేట్ జీఎంలు, ఏరియా జీఎంలు తదితరులు పాల్గొన్నారు. మొత్తం 7 టెక్నికల్ సెషన్లను నిర్వహించారు. వీటిలో ప్రధానంగా అటవీ భూముల బదలాయింపు, గనులతో చేపట్టవలసిన రీక్లెమేషన్, బయోడైవర్సిటీ పనులు, భూగర్భ జలాల సమతుల్యత పాటింపులో తీసుకోవలసిన జాగ్రత్తలు చట్టాలు మైనింగ్ సంస్థల కర్తవ్యాలు అనే అంశాల పైన సుదీర్ఘంగా చర్చించారు.

## మా మద్దతు సోయం కృష్ణవేణికే

- **ఆటో యూనియన్ ప్రెసిడెంట్ పామార్ బాలాజీ**

**చర్ల, డిసెంబర్ 01:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో సోమవారం చర్ల మేజర్ పంచాయతీకి పోటీ చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సోయం కృష్ణవేణి కి శ్రీ గణేష్ ఆటో యూనియన్ 200 మంది డ్రైవర్లు ఓనర్లు మద్దతు ప్రకటించారు . ఈ సందర్భంగా పామార్ బాలాజీ, మాట్లాడుతూ చర్ల పంచాయతీలో సుమారు 200 మంది ఆటో కార్మికులం ఓనర్లము ఉన్నామని ఈ 200 కుటుంబాల మద్దతు సోయం కృష్ణవేణి కి ఇస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు .ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ప్రెసిడెంట్ పామర్ బాలాజీ, గౌరవ అధ్యక్షులు తెల్ల మల్లాజీ అజయ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్లు దాన సరి సంపత్, బాలరాజులు, సత్తి రాజు, సెక్రటరీ కోడి రెక్కల నాగరాజు, ఉప సెక్రటరీ చల్లా అశోక్ కుమార్, యూత్ ప్రెసిడెంట్ జంజీరాల తులసిరామ్, కంచర్ల సతీష్, కోశాధికారి కుక్కడపు రాంబాబు, స్టీరింగ్ కమిటీ సభ్యులు దొంతు ప్రసాద్ , సయ్యద్ యాకూబ్ ,పొగాకు నరసింహారావు, చింతల హరిబాబు, వేల్పుల శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు .



# వివాహానికి ముందు జాతకాలు కాదు...
# హెచ్ఐవి స్థితిని తెలుసుకోవాలి

- ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం కార్యక్రమంలో
- జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారం రాథోడ్





**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 1, ప్రజా జ్యోతి**

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో, దాక్కు సహకారంతో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వైద్య అధికారి డా. తుకారం రాథోడ్ మాట్లాడుతూ:హెచ్ఐవీ వంటి హెపటైటిస్-బి, హెపటైటిస్-సి కూడా రక్తం ద్వారా వ్యాపించే వ్యాధులేనని,యువతలో డ్రగ్స్ వాడకం పెరగడం ఆందోళనకరమన్నారు, వివాహానికి ముందు జాతకాలు కాదని, హెచ్ఐవీ స్థితిని తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు, ప్రతి ఒక్కరూ తమ హెచ్ఐవీ స్థితిని తెలుసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు. అనంతరం అడిషనల్ రాజమల్లు, ఎస్ పి ఎల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మాట్లాడుతూ:ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ప్రతి వ్యక్తికి తప్పనిసరి అని, "ఎవరి హెల్త్ వారు" అన్న భావనతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి అని సూచించారు.డా. సైదులు మాట్లాడుతూ:విద్యార్థుల్లో మొబైల్ ఫోన్ వినియోగం అధికంగా ఉన్న తరుణంలో, హెచ్ఐవీపై సరైన అవగాహన కలిగి చదువులో ఉన్నతస్థాయికి చేరాలని సూచించారు.ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్ డా. తేజస్విని మాట్లాడుతూ:హెచ్ఐవీ సోకి చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వం అందిస్తున్న సేవలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.సురక్షిత లైంగిక సంబంధాలు, సురక్షిత రక్త మార్పిడి, ఒకరు వాడిన సూదులు/సిరంజీలను మరొకరు వాడకూడదని, టాటూలు వేయించుకోవడంలో జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.హెచ్ఐవీ అంటు వ్యాధి కాదని, ఇది అంటించుకునే వ్యాధి అని అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ 20 యూనిట్ల రక్తాన్ని సేకరించడం జరిగిందన్నారు, అదేవిధంగా అవగాహన బృందం తమ ప్రదర్శనతో ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ కార్యకలాపాల్లో సేవలందించిన సిబ్బందికి మెమెంటోలు అందజేశారు, కార్యక్రమంలో బార్ కౌన్సిల్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్,ఆర్ట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజస్విని, టిబి ప్రోగ్రాం ఆఫీసర్ డా. ఎన్ సి డి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్.మధువరన్, , వైద్య సిబ్బంది, కాలేజీ సిబ్బంది, కళాజాత బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఐటీడీఏలో గిరిజన దర్బార్ నిర్వహణ



**భద్రాచలం టౌన్ డిసెంబర్ 1(ప్రజాజ్యోతి)** భద్రాచలం ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం ఐటడీఏ పీవో జనరల్ డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో గిరిజన దర్బార్ నిర్వహించారు. ఈ సమయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి వద్ద నుంచి గిరిజన దర్బార్ లో వివిధ సమస్యల గురించి విన్నవించడానికి వచ్చిన గిరిజనుల నుండి ఆయన అర్జీలు స్వీకరించారు. స్థానిక సంస్థల ఎన్నికల మోడల్ కోడ్ ఉన్నందున గిరిజనుల సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను మాత్రమే స్వీకరించడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎలక్షన్ మోడల్ కోడ్ అమలులోకి వచ్చినందున వివిధ సమస్యల గురించి అర్జీలు పెట్టిన గిరిజనుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని, స్థానిక సంస్థల ఎన్నికల మోడల్ కోడ్ ముగియగానే వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పరిపాలన అధికారి సున్నం రాంబాబు, కొండరెడ్ల విభాగం అధికారి గన్యా, మేనేజర్ ఆదినారాయణ, ఎల్ టి ఆర్ డి టి రామ్ నరేష్, ఇతర విభాగాలకు చెందిన సిబ్బంది భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు అప్రమత్తంగా ఉండండి



**చర్ల, డిసెంబర్:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో సోమవారం ద్విత్వ తుఫాను హెచ్చరిక సందర్భంగా చర్ల మండలం ఎమ్మార్వో అన్ని ధాన్యం కేంద్రాలలో రైతులకు అందుబాటులో భరకములు ఉన్నాయా లేవా అని పరిశీలించి సంబంధిత కొనుగోలు కేంద్రం ఇన్చార్జిని పిలిచి రైతులందరికీ భరకములు ఇవ్వమని ఆదేశించారు .ద్విత్వా తుఫాను ప్రభావం వలన మండలంలో రైతులు ఇబ్బంది పడకుండా వరి ధాన్యాన్ని భద్రపరచుకోవటానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. భద్రాచలం డివిజన్ రైతు సంఘం అధ్యక్షులు ఇందులగోపాల బుచ్చిబాబు సంబంధిత రివ్యూ ఇన్స్పెక్టర్ వీఆర్వో పాల్గొన్నారు.

## అధికారం పార్టీకి కొమ్ము కాస్తున్న ఎన్నికల అధికారులు

- బిఆర్ఎస్ పార్టీ ఆరోపణ



**భద్రాచలం టౌన్,డిసెంబర్ 1(ప్రజా జ్యోతి)** భద్రాచలం గ్రామపంచాయతీ ఎన్నికల విషయంలో అధికార పార్టీకి స్థానిక ఎన్నికల అధికారులు కొమ్ముకాస్తున్నారని టిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ ఆరోపించారు. సర్పంచ్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన వ్యక్తి ఎన్నికల్లో పోటీ చేసేందుకు నిబంధనలు అనుసరించి అనర్హుడైనప్పటికీ స్క్రూట్ నీలో అతని పేరు తొలగించకుండా అధికార పార్టీ వత్తిళ్లకు ఎన్నికల అధికారులు తలవంచటం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల నిబంధనలను ఎందుకు తుంగలో తొక్కారని ఆయన ఆరోపించారు. ఇందుకు సంబంధించి ఫిర్యాదు చేసినప్పటికీ కనీసం పట్టించుకోకపోవడం విడ్డూరమని ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. ఎన్నికల నిర్వహణకు తాము సహకరిస్తూ ఉంటే ఎన్నికల అధికారులు ఈ రకంగా అధికార పార్టీకి వత్తాసు పలకటం, అనర్హులను సమర్థించటం ప్రజాస్వామ్య వ్యవస్థలో సబబు కాదని ఆయన హితవు పలికారు. కాంగ్రెసు, బిజెపి పార్టీలు రెండు ఒకటేనని డ్రామాలాడుతున్నాయని ఆయన దుయ్యబట్టారు.

## భగవద్గీత పారాయణం



**చర్ల, డిసెంబర్ 01:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో సోమవారం బస్టాండ్ పక్కన వెలసిన శ్రీదేవి భూదేవి సమేత సప్త ద్వారాల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం లో గీతా జయంతి సందర్భంగా సంపూర్ణ భగవద్గీత అధ్యాయం భక్తుల సమక్షంలో జరిగింది భక్తులందరూ పాల్గొని గీతా పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో పఠించి స్వామివారి అనుగ్రహ పాత్రులు అయ్యారు.ఈ కార్యక్రమంలో గీతా ధర్మ ప్రచార సేవా సమితి అధ్యక్షులు నెట్టెం రాధాకృష్ణ,ఉపాధ్యక్షులుఎడారి.రామ్మూర్తి,కె.లక్ష్మీనారాయణ,సహకార్యదర్శినెట్టెం రమాదేవి,కమి టీ సభ్యులు ఎల్.జ్యోతి,కెవిజయలక్ష్మి ,ఎస్.కవిత,పి.లక్ష్మణ,డి.లక్ష్మి ,జి.స్నిగ్ధ,యు.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## కె.రేగుబల్లి ఉపాధ్యాయుడిని సన్మానించిన ఐటీడీఏ పీవో రాల్

- ఐఎఎస్ అకాడమీలో తీసుకున్న లెటర్‌ను అందజేసిన పీవో

**భద్రాచలం టౌన్, డిసెంబర్ 1(ప్రజాజ్యోతి ):** గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న దుమ్ముగూడెం మండలం, కే. రేగుబల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని కే. గంగోలు జిపిఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు కారం గాంధీని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాల్ తన ఛాంబర్‌లో ఘనంగా సత్కరించారు. గాంధీ ఉద్దీపకం వర్క్ బుక్ -2 లోని అంశాలు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధతో విద్యా బోధన చేసి విద్యార్థులు ప్రతి అంశంలో చదువు పరంగా నైపుణ్యాలు పెంచడంతో విద్యార్థులు అడిగిన ప్రతి ప్రశ్నకు భయపడకుండా సమాధానం చెప్పడంతో సంబంధిత ఉపాధ్యాయుడుని ప్రత్యేకంగా అభినందించి సన్మానం చేయడం జరిగిందన్నారు. అలాగే ఐఏఎస్ అకాడమీలో శిక్షణ తీసుకున్న సందర్భంలో లాల్ బహుదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ గ్రీటింగ్ లెటర్ ను ఉపాధ్యాయుడుకు అందించి శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ ఉపాధ్యాయుడుని ఆదర్శంగా తీసుకొని మిగతా జిపిఎస్ పాఠశాలలో పనిచేయుచున్న ఎస్జిటీలు ఉద్దీపకం వర్క్ బుక్ సక్రమంగా పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధించాలని తెలుపుతూ పిల్లల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపరిచే ఉపాధ్యాయులను లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ గ్రీటింగ్ లెటర్ అందించి ప్రత్యేకంగా సత్కరించడం జరుగుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్ పాల్గొన్నారు.



## ఘనంగా పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుక

**బూర్గంపహాడ్,డిసెంబర్1 (ప్రజా జ్యోతి ):** దాదాపు పాతికేళ్ల తర్వాత తమ స్నేహితులు, చదువు చెప్పిన గురువులను చూసి పూర్వ విద్యార్థులు మురిసిపోయారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ సందడిగా గడిపారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం సారపాకలోని సెయింట్ తెరిసా పాఠశాలలో 1991-2001 సంవత్సరం(సిల్వర్ జూబ్లీ) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉన్నత స్థానాలకు ఎదిగిన తమ పూర్వ విద్యార్థులను చూసి గురువులు ఆనందించారు. జీవితంలో ఇంకా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశీర్వదించారు. తమపై విద్యార్థుల ప్రేమాభిమానాలు ఎల్లప్పుడు ఉండాలని కోరుకున్నారు. విద్యార్థినీ విద్యార్థులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థి దశలో గురువులతో మెలిగిన సందర్భాలను తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు అందరూ పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ కి పీఎం శ్రీ కొత్తపల్లి విద్యార్థుల ఎంపిక



**దుమ్ముగూడెం, డిసెంబర్ 1(ప్రజాజ్యోతి):** కొత్తగూడెంలో సెయింట్ మేరీస్ పాఠశాలలో జరిగిన 53వ రాష్ట్రస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన 2025 జిల్లా స్థాయిలో జరిగిన ప్రదర్శనలో రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ కి పీఎం శ్రీ కొత్తపల్లి విద్యార్థిని ఎంపిక అవడం జరిగిందని హెచ్ఎం పుణ్యం నరసింహారావు అన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు అభినందించిన అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ నవంబర్ 25, 26, 27 తేదీలలో కొత్తగూడెంలో జరిగిన రాష్ట్రస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో కొత్తపల్లి విద్యార్థులు పాల్గొని, వాటర్ కన్జర్వేషన్ మరియు మేనేజ్మెంట్ విభాగంలో శ్రీరామ్ 9వ తరగతి విద్యార్థి ప్రథమ బహుమతి పొంది రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ కి ఎంపిక అవ్వడం జరిగిందని, అలాగే సస్టైనబుల్ అగ్రికల్చర్ విభాగంలో యశ్వంత్ సాయి తొమ్మిదవ తరగతి విద్యార్థి ద్వితీయ బహుమతి పొందడం జరిగిందని అన్నారు. ఈ విద్యార్థులకు గైడ్ టీచర్లుగా నాగేశ్వరరావు ప్రతాప్ రామ్ దాస్, మరియు రజిత స్ఫూర్తినిస్తూ వారు రాష్ట్రస్థాయికి ఎంపిక అయ్యేవిధంగా సూచనలు సలహాలు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడి హరికృష్ణ, చెన్నారావు మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ముత్తంగి అలంకారంలో భద్రాద్రి రామయ్య



**భద్రాచలం టౌన్, డిసెంబర్ 1(ప్రజాజ్యోతి ):** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారు సోమవారం సందర్భంగా ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసమయంలో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

## ఏకతాటిపైకి వచ్చిన గ్రామస్తులు


- రామన్నగూడెం పంచాయతీ ఏకగ్రీవం.
- ఆదివాసి సంక్షేమ పరిషత్ సర్పంచ్, వార్డుసభ్యులు కైవసం.



**అశ్వారావుపేట,డిసెంబర్ 01, ప్రజాజ్యోతి :** మండలంలోని రామన్నగూడెం గ్రామపంచాయతీ ఏకగ్రీవం అయినట్టే. 6 వార్డులు, 350 ఓట్లు కలిగిన ఈ పంచాయితీలో అందరూ ఆదివాసీలే కావటంతో వేరే రాజకీయ పార్టీలకు ఈ పంచాయతీలో అవకాశం లేకుండా పోయింది. కనీసం ఒక్క పార్టీ కూడా అభ్యర్థులను నిలబెట్టకపోవడంతో,ఏ పార్టీలకు చెందిన వారు ఎవరు కూడా లేకపోవడంతో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సర్పంచ్ అభ్యర్థిగా మడకం నాగేశ్వరరావుతో పాటు మరో ఆరుగురు వార్డు సభ్యులు సోమవారం నామినేషన్లను దాఖలు చేశారు. గ్రామమంతా తీర్మానం చేసి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికను ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది

# "ఈ గట్టునుంటారా... ఆ గట్టుకెళ్తారా"

- గ్రామపంచాయతీ పోరులో "సిత్రాలు"
- హస్తంలో విభేదాలు..!
- కార్యకర్తలలో అంతర్మధనం
- పిట్ట పోరు పిట్ట పోరు పిల్లి తీర్చనుందా..!




**చర్ల, డిసెంబర్ 01:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో గ్రామపంచాయతీ పోరులో భాగంగా నామినేషన్ల మొదటి ఘట్టాన్ని విజయవంతంగా పూర్తి చేసిన ప్రధాన రాజకీయ పార్టీలు తదనంతరం రెండవ ఘట్టానికి అడుగుపెట్టారు. రెండవ ఘట్టంలో మండల వాసులకి గ్రామపంచాయతీ పోరులో ఎన్నో సిత్రాలు కనపడుతున్నాయి చర్ల మండలంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ లో నెలకొన్న ఉత్కంఠత తీరిన తరువాత రాజకీయ పార్టీలు అనుసరిస్తున్న రాజకీయం మండల వాసులను విస్మయానికి గురి చేస్తున్నది. చర్ల మండలంలో మేజర్ పంచాయతీ పరిధిలో నెలకొన్న పరిస్థితులతో అభ్యర్థులతో పాటు రాజకీయ నాయకులు కూడా "ఈ గట్టునుంటారా .. ఆ గట్టుకెళ్తారా" .. అన్న చందముగా రోజుకి రాజకీయ పరిణామాలు మారుతున్నాయి అని మండల వాసులు చర్చిస్తున్నారు . మొన్నటిదాకా కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నేడు మండలంలో ప్రధాన పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత విభేదాల కారణంగా రెండు వర్గాలుగా విడిపోయి కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థితో ప్రచారానికి ఒక వర్గం కాంగ్రెస్ పార్టీకి నిరంతరం ప్రత్యర్థిగా ఉన్న బిఆర్ఎస్ పార్టీ, సిపిఎం పార్టీ బలపరిచిన అభ్యర్థితో మరో కాంగ్రెస్ వర్గం ప్రచారం సాగించటంతో చర్ల మండల వాసులు ఒకింత ఆశ్చర్యానికి గురవుతున్నారు .నిరంతరం కాంగ్రెస్ ప్రభుత్వం పై కాంగ్రెస్ పాలనపై గళం విప్పుతున్న ప్రత్యర్థి పార్టీ అయిన బిఆర్ఎస్ అభ్యర్థికి కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఒక వర్గం వారి ప్రచార కార్యక్రమాలలో పాల్గొనడం కాంగ్రెస్ పార్టీకి మండలంలోని కార్యకర్తలకి మింగుడు పడని అంశం. కాంగ్రెస్ లోని విభేదాలు కార్యకర్తలతో పాటు మండల వాసులలోనూ చర్చనీయాంసమైనది . నామినేషన్ల ఉపసంహరణ తేదీ రాక ముందే గుర్తులు కేటాయించక ముందే రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రచారంలోకి తీసుకువెళ్ళటం ముఖ్యంగా కాంగ్రెస్ లో నెలకొన్న ఈ పరిస్థితితో అటు కాంగ్రెస్ లో ఉన్న దిగువ శ్రేణి కార్యకర్తలకు పోటీ చేసిన అభ్యర్థులకు ఏమి చేయాలో తోచని పరిస్థితి నెలకొన్నది అని మండల వాసులు అంటున్నారు .ఈ పరిస్థితులన్నిటినీ నిశితంగా పరిశీలిస్తున్న చర్ల మండల వాసులు రాజకీయ పరిణామాలపై తమ తమ ఆలోచనలను చేస్తున్నారు కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేసిన వార్డు మెంబర్లు ఇరు వర్గాల కాంగ్రెస్ నాయకులతో సత్సంబంధాలు కలిగి ఉండటంతో ప్రచారానికి ఎటువైపు వెళ్ళాలో తేల్చుకోలేని పరిస్థితి ఏర్పడినది అని కాంగ్రెస్ కార్యకర్తలు ఒకింత అయోమయానికి గురవుతున్నారని వారి అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. వీరి విభేదాలతో రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిపై ఓటు ప్రభావం ఉండనున్నదా అని మండల వాసులు చర్చించుకుంటున్నారు. ఎన్నిలల్లో గెలిచిన వార్డు మెంబర్లు పంచాయతీ సర్పంచ్ లు తర్వాత తమ సొంత పార్టీలో ఉంటారా లేక వేరే పార్టీలో చేరతారా అనే చర్చ మండల వాసుల్లో మొదలైనది.

**"పిట్ట పోరు పిట్ట పోరు పిల్లి తీర్చనుందా":**

" పిట్ట పోరు పిట్ట పోరు పిల్లి తీర్చనుందా" అన్న సామెతలా కాంగ్రెస్ లోని విభేదాలు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కి అనుకూలించే అంశాలుగా మారుతున్నాయని చర్ల మండల వాసులు అనుకుంటున్నారు. వీరి మధ్య నెలకొన్న రాజకీయ విభేదాలు గ్రామపంచాయతీ పోరులో ఉన్న బీఎస్పీకి,బీజేపీకి కలిసి వచ్చే అంశాలుగా మారనున్నాయని బీఎస్పీ,బీజేపీ కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. వీరి వైఫల్యాలని వీరి రాజకీయ పరిణామాలను ప్రజల వద్దకు తీసుకుని వెళ్లి అర్థమయ్యే రీతిలో వారికి చెప్పి ఫలితాలలో బీఎస్పీ ,బిజెపిలు కూడా తమదైన మార్కును చూపించి మండలంలో లోని మేజర్ పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పోటీ ఇచ్చే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారని అటు బిజెపి శ్రేణులు, బిఎస్పి వర్గాలు అంటున్నారు.మారుతున్న రాజకీయ పరిణామాలపై చర్ల మండల ప్రజలు వారి అభిప్రాయాలను తెలియజేసేందుకు సిద్ధంగా తమదైన శైలిలో ఓటుని వినియోగించుకొని తమ నిర్ణయాన్ని తెలియజేసేందుకు ఉన్నారని మండల వాసులు అంటున్నారు .మారుతున్న రాజకీయ ఫలితాలు ఎలా ఉండబోతాయో అని తెలియటానికి ఫలితాలు వచ్చేవరకు మరిన్ని రోజులు మండల వాసులతో పాటు రాజకీయ పార్టీలు కూడా వేచి చూడాలి.

# నాటుసారా పట్టివేత

- బైక్ స్వాధీనం, ఒకరి అరెస్ట్



**కొత్తగూడెం,డిసెంబర్ 1(ప్రజాజ్యోతి):** కొత్తగూడెం ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ టీం నాటుసారా రవాణా సమాచారం మేరకు సోమవారం సింగభూపాలం గ్రామ శివారున వాహన తనిఖీ నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనం మీద తరలిస్తున్న (03) లీటర్ల నాటు సారాయి పట్టుకుని కరివారిగూడెంకు చెందిన భూక్యా రాంబాబు అను వ్యక్తి మీద కేసు నమోదు చేసి అతని వద్ద నుంచి నాటుసారా, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు డిటిఎఫ్ ఎస్ఐ గౌతమ్ తెలిపారు.ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సిబ్బంది రామకృష్ణ గౌడ్, వెంకట నారాయణ, రమేష్, పార్థ సారధి పాల్గొన్నారు.

## నాగుపల్లి సీతారామ ప్రాజెక్టులో ప్రమాదం

- కార్మికుడు విద్యుత్ షాక్‌తో మృతి





**దమ్మపేట, డిసెంబర్ 01,(ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నాగుపల్లి గ్రామంలోని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాలువ వద్ద సోమవారం ఉదయం పది గంటలకు జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడు విద్యుత్ షాక్ కారణంగా మృతిచెందాడు. ఈ సంఘటనపై ప్రాజెక్టు సూపర్వైజర్ ఇందుకూరి కృష్ణంరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 312/2025 యు/ఎస్ 194 బి.యన్.యస్ ప్రకారం కేసు నమోదు చేయబడింది.పోలీస్ వారి వివరాలు ప్రకారం, మధ్యప్రదేశ్ రాష్ట్రం, షాహడోల్ జిల్లా, జహాసింగ్నగర్‌కు చెందిన రామ్‌సింగ్ గోండ్ (25 సంవత్సరాలు), డ్రిల్లింగ్ మెషిన్ ఆపరేటర్‌గా పనిచేస్తూ కాలువలో రాళ్లను తొలగించే పనులు చేస్తున్నాడు. పనిలో ఉన్న సమయంలో డ్రిల్లింగ్ మెషిన్ 11 కేవీ విద్యుత్ తీగలను తాకడంతో అతను ఘోరంగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందినాడు.సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తును కొనసాగిస్తున్నారు.